www.dainamicnews.com
శుభోదయ
డైనమిక్
ప్రజల కోసం - ప్రగతి కోసం
dianamicnews Tv
dianamicnews.epaper.com

విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న డైనమిక్ దినపత్రికలో అన్ని మండలాల వారీగా విలేకరులు కావలెను.
డైనమిక్
CELL : 96523 03089

తెలంగాణా- ఎపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | గురువారం 10 సెప్టెంబర్ 2026 | వెల : 4/-



# భారత్, రష్యా రక్షణ ఒప్పందం

- ఈ సారి ఆ మూడింటిపైనే మెయిన్ ఫోకస్?!
- ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్
- ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ సుఖోయ్-57 సాంకేతిక బదిలీ
- అత్యంత శక్తివంతమైన బ్రహ్మోస్ క్షిపణి అప్‌గ్రేడేషన్
- ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించే మూడు ప్రధాన అంశాలు



# విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

- సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుంది: సుప్రీంకోర్టు
- ఎన్‌సీఈఆర్‌టీపై కీలక వ్యాఖ్యలు చేసిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని వెల్లడి
- అయితే వాటిని సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా వ్యక్తం చేయాలని సూచన

# ఆ రెండూ కుట్రలే!

- స్పీకర్‌ను, శుద్ధి పేరుతో దళితులను అవమానించటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది
- వ్యూహకర్తలు, ప్రత్యక్షంగా అమలు చేసిన వారిపై కేసులు పెడతాం: అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి
- విచారణ జరిపి జైలుకు పంపే ఏర్పాటు చేస్తాం
- విచారణాధికారిగా హైదరాబాద్ సిటీ పోలీసు జాయింట్ కమిషనర్
- ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకే కుట్రలు
- ఫామ్‌హౌస్ భేటీలోనే వ్యూహరచన.. కేసీఆర్ అనుచరులను ఉన్మాదులుగా మార్చి ఉసిగొల్పారు
- దళితులను అవమానించిన ఆ కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించాలన్న సీఎం
- వారిలోని అహంకార, అంటరానితన భావాన్ని యాసిడ్‌తో శుద్ధి చేయాలా? అంటూ ప్రశ్న
- ప్రభుత్వం స్పీకర్‌కు పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని స్పష్టీకరణ



హైదరాబాద్

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను, ఆయన మాతృమూర్తిని కించపరిచి అవమానించటం, అనంతరం ఆయనకు మద్దతుగా నిరసన తెలిపిన దళితులు నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేయటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలను కుట్రలుగానే పరిగణిస్తున్నామని చెప్పారు. ఇందుకు వ్యూహకర్తలు, ప్రత్యక్షంగా అమలు చేసిన వారిపై ఆయా సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి, విచారణ జరిపి జైలుకు పంపే ఏర్పాటు చేస్తామని అన్నారు. ముంబయిపై దాడి చేసిన కసబ్ లాంటి ఉగ్రవాదులకు కొన్ని అంశాలను నూరిపోసి ఉన్మాదులుగా మార్చి మన దేశంపైకి పంపిన తరహాలోనే, కేసీఆర్ కూడా తన అనుచరులకు ఇలాగే నూరిపోసి ఉన్మాదులుగా మార్చి ఉసిగొల్పారని ఆరోపించారు. దాంతో పేట్రేగిన నేతలు ఆ రోజు దళిత స్పీకర్‌ను కించపరచటమే లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఆ కార్యక్రమానికి ముందురోజు ఫామ్‌హౌస్‌లో జరిగిన భేటీలో చేసిన కుట్ర మొదలు ఆ తర్వాత వరుసగా చోటుచేసుకున్న ఘటనలపై సంపూర్ణ విచారణ చేపడతామన్నారు. హైదరా బాద్ సిటీ పోలీసు జాయింట్ కమిషనర్ విజయకుమార్‌ను - మిగతా3లో



# కోహెడకు రూ.637.70 కోట్లు

- ప్రపంచస్థాయి పండ్ల మార్కెట్ తొలి దశ పనులకు అనుమతి
- 178.16 ఎకరాల విస్తీర్ణంలో ఈ సమగ్ర పండ్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నారు
- మొదటి దశలో భాగంగా ఆరు వేలం హాళ్లు, వాటికి అనుబంధంగా మీజనైన్ ఏసీ అంతస్తులు నిర్మించనున్నారు.

హైదరాబాద్

రాష్ట్ర రాజధానికి సమీపంలో కోహెడలో నిర్మించనున్న ప్రపంచస్థాయి సమగ్ర పండ్ల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చూడటమే లక్ష్యంగా దీన్ని నిర్మిస్తోంది. మార్కెట్ తొలి దశ పనులకు రూ.637.70 కోట్ల పరిపాలనా అనుమతిని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా - మిగతా3లో

# ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి రూ.1,473 కోట్ల విరాళాలు

- కాంగ్రెస్ కంటే 7 రెట్లు ఎక్కువ
- ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో బీజేపీకి రూ.1,472.8 కోట్ల నిధులు
- కాంగ్రెస్ మొత్తం రూ.207.17 కోట్లు
- ఈసీకి సమర్పించిన ఖర్చుల వివరాల్లో వెల్లడి



## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

- సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్
- రెండో కూటమి సమన్వయ సమావేశంలో నిర్ణయం
- ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందన్న తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు



# శాంతి భద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు



- నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించాం
- శాసనసభ్యులపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం
- లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై ఫిర్యాదు చేసిన నేతలు
- శాంతిభద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు

హైదరాబాద్

లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపామని, ఎమ్మెల్యే సబితపై పోలీసుల దాడి, సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించామని తెలిపారు. తమపై దాడులు చేసి తమపైనే కేసులు పెట్టారని శివ్‌ప్రతాప్ శుక్లాకు వివరించామని పేర్కొన్నారు. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా - మిగతా3లో

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై యాక్షన్
- సభను అడ్డుకుంటున్న సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- దీంతో సస్పన్షన్ వేటు వేస్తూ ప్రకటించిన స్పీకర్ ప్రసాద్ కుమార్
- బీఆర్ఎస్ సభ్యులను సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన స్పీకర్



హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, - మిగతా3లో

## విజయ్ నాయకత్వంలో కొత్త కూటమి

తమిళనాడులో కొత్త రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేతృత్వంలోని కొత్త కూటమి ఆవిర్భవించింది. దానికి “సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్” అని పేరు పెట్టారు. చెన్నైలోని పనైయూర్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రెండో కూటమి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పేరే తమ కూటమి సిద్ధాంతాలను, అజెండాను తెలియజేస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ తెలిపారు. తమిళనాడు హక్కుల కోసం పోరాడే పార్టీలన్నీ ఈ కూటమిలో ఉన్నాయని ఆయన చెప్పారు. త్వరలో జరిగే ఉపఎన్నికల్లో కూటమి ఉమ్మడిగా పోటీచేస్తుందని మాణికం ఠాగూర్ ప్రకటించారు. లౌకికవాదం, సామాజిక న్యాయం, రాష్ట్ర హక్కుల సాధనే ధ్యేయంగా బరిలోకి దిగనున్న కొత్త కూటమి త్వరలో జరిగే ఉపఎన్నికల్లో సత్తా చాటేందుకు వ్యూహరచన చేస్తోంది. టీవీకే వ్యవస్థాపకుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విదుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐఎంయూఎల్) వంటి కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదు

విమర్శలను న్యాయవ్యవస్థ వ్యతిరేకించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కానీ సమాచారం లేని వాదనలను వ్యతిరేకిస్తుందని స్పష్టం చేసింది. అయితే న్యాయవ్యవస్థపై విమర్శలను సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతంగా, హేతుబద్ధమైన పద్ధతిలో వ్యక్తం చేయాలని హెచ్చరించింది. విమర్శకు, మౌనానికి మధ్య తేడా లేదని పేర్కొంది. బాధ్యతాయుతమైన చర్చకు, సమాచారం లేని వాదనకు మధ్యే తేడా ఉందని అభిప్రాయపడింది. ఎన్?సీఈఆర్‌టీ ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలో ‘న్యాయవ్యవస్థలోని అవినీతి’ అనే అంశాన్ని ప్రవేశపెట్టడంపై సుమోటోగా స్వీకరించి కేసుపై విచారణను ముగిస్తూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. “న్యాయవ్యవస్థ విమర్శలను వ్యతిరేకించదు. వ్యతిరేకించజాలదు. ఒక శక్తివంతమైన రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేయాలి. ఆ విమర్శలు వ్యవస్థ జవాబుదారీతనానికి, స్వీయ సవరణకు దోహదపడతాయి. న్యాయవ్యవస్థపై విమర్శలు సరైన వేదిక ద్వారా నిష్పక్షపాతమైన, హేతుబద్ధమైన యంత్రాంగంలో వినిపించాలి. అంతేగానీ సున్నితమైన మనసుల కోసం ఉద్దేశించిన పాఠశాల పాఠ్యప్రణాళికలోకి ధ్రువీకరణ లేకుండా ప్రవేశించకూడదు” అని సుప్రీంకోర్టు పేర్కొంది.

**అసలేంటి వివాదం?**

ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 8వ తరగతి సోషల్ సైన్స్ పుస్తకంలోని ఛాప్టర్ 4 అయిన ‘ది రోల్ ఆఫ్ ది జ్యుడిషియరీ ఇన్ సొసైటీ (సమాజంలో న్యాయ వ్యవస్థ పాత్ర)’ అధ్యాయంలో న్యాయ వ్యవస్థలో అవినీతి, కేసుల పెండింగ్, మౌలిక వసతుల కొరత, న్యాయమూర్తుల కొరత వంటి అంశాలు ఉండటంతో వివాదం మొదలైంది. ఈ అధ్యాయం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపైనే సుప్రీం కోర్టు సుమోటాగా విచారణ చేపట్టి ఎన్‌సీఈఆర్‌టీపై మండిపడింది. అనంతరం సోషల్ సైన్స్ బుక్‌కు సంబంధించిన ముద్రణ పూర్తైన, అలాగే డిజిటల్ కాపీలన్నింటినీ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంకా ఆ పుస్తకాన్ని మళ్లీ ముద్రించడం, డిజిటల్ రూపంలో ప్రచురించడం లేదా పంపిణీ చేయడంపై పూర్తి నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్‌సీఆర్‌టీపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టుకు ఎన్‌సీఈఆర్‌టీ క్షమాపణలు చెప్పింది.

**సవరించిన పాఠ్య పుస్తకం**

అనంతరం ఎన్‌సీఈఆర్‌టీ సోషల్ సైన్స్ బుక్‌ను సవరించింది. ఈ క్రమంలో పలు మార్పులు చేసింది. ‘స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఎందుకు అవసరం?’ అనే ప్రారంభ ప్రశ్నను తొలగించి ‘న్యాయబద్ధమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అసలు న్యాయం ఎందుకు అవసరం? అనే కోణంలో కొత్త అంశాన్ని చేర్చింది. ఇంకా ‘న్యాయ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు’ అనే విభాగాన్ని పూర్తిగా తొలగించింది. అందులో కోర్టుల్లో న్యాయమూర్తుల కొరత, క్లిష్టమైన న్యాయ ప్రక్రియ, బలహీనమైన మౌలిక వసతులే కారణమని ఉంది. ఈ అంశాన్ని పుస్తకం నుంచి తొలగించింది. అసలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా ఉన్నటువంటి న్యాయ వ్యవస్థలో అవినీతి అనే విభాగాన్ని కూడా పూర్తిగా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది.

**ముగిసిన కేసు**

కొత్త అధ్యాయంతో కూడిన కొత్త ఎన్‌సీఈఆర్‌టీ బుక్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారని సెప్టెంబరు 1న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలియజేశారు. దీంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎన్‌సీఈఆర్‌టీ బుక్ వివాదం సివిల్ సుమోటో రిట్ పిటిషన్‌ను మూసివేసింది. కాగా, కేంద్రం ఏర్పాటు చేసిన నిపుణుల బృందం సూచించిన సవరణల ఆధారంగా వివాదాస్పద అధ్యాయాన్ని ఎన్‌సీఈఆర్‌టీ మార్చిందని సుప్రీంకోర్టు గమనించింది. కేంద్ర ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి సుప్రీంకోర్టు (రిటైర్డ్) జడ్జి జస్టిస్ ఇందు మల్హోత్రా నేతృత్వం వహించారు. ఈ కమిటీలో సీనియర్ న్యాయవాది, భారతదేశ మాజీ అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్, ప్రొఫెసర్ ప్రకాశ్ సింగ్ ఉన్నారు.

# బుల్డోజర్లు పెట్టిన కదలని హనుమాన్...

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాచీన హనుమంతుని ఆలయాన్ని తొలగించారు. అయితే, అందులోని హనుమ విగ్రహాన్ని మాత్రం అక్కడ నుంచి తరలించడం సాధ్యం కాలేదు. నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి, భారీ యంత్రాలతో ప్రయత్నించినా... విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదు. ఈ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. కంతాల్ చౌరాహా – ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న ‘ఖడే హనుమాన్’ ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు. 2028లో జరగబోయే ‘సింహస్థ కుంభమేళా’ కోసం నగరంలో మౌలిక వసతుల విస్తరణ, రోడ్ల వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుణ్యకాలంలో క్షిప్రా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు పరమశివుడి క్షేత్రమైన ఉజ్జయినికి తరలివస్తారు. అందులో భాగంగానే రహదారి విస్తరణ చేపట్టగా.. పురాతన ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉజ్జయిని మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఈ విగ్రహాన్ని టాంకీ చౌక్ సమీపంలో నూతనంగా నిర్మించే ప్రాంతానికి సురక్షితంగా తరలించాలని ప్రణాళిక రచించాయి. ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించినప్పటికీ, నిలబడి ఉన్న హనుమంతుని విగ్రహం మాత్రం ఉన్న చోటు నుంచి కదల్లేదు. అధికారులు, కార్మికులు భారీ యంత్రాల (జేసీబీలు, క్రేన్లు) సహాయంతో విగ్రహాన్ని తరలించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. స్థానిక మీడియా నివేదిక ప్రకారం, గత కొద్ది రోజుల్లో నాలుగుసార్లు జరిపిన ప్రయత్నాలు విఫలం కావడంతో, అధికారులు భారీ యంత్రాల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు

**’దైవ లీల’గా ప్రచారం**

విగ్రహాన్ని కదిలించడంలో అధికారులు విఫలమవడంతో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకమంది దీనిని దైవ లీలగా అభివర్ణిస్తున్నారు. అదే సమయంలో ఆలయ ప్రాంగణం వద్దకు పెద్ద ఎత్తున కోతులు గుమిగూడిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో నమ్మకం మరింత బలపడింది. ఆలయ అర్చకుడు మహేష్ బైరాగి మాట్లాడుతూ.. వరుసగా జరుగుతున్న ఈ విఫల యత్నాలు

## కాళోజీ సాహిత్యం ఆచరణీయం: కలెక్టర్ చంద్రశేఖర్



**నల్గొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు సాహిత్యం ఆచరణీయమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.కాళోజీ తన రచనల ద్వారా తెలంగాణ భాష, సంస్కృతి, సామాజిక చైతన్యానికి విశేష సేవలందించారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్వో దశరథ్, ఏఓ మోతిలాల్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారి--65పై ఆహార పరిరక్షణ అధికారుల తనిఖీలు



**నల్గొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** జాతీయ రహదారి--65 వెంబడి హోటళ్లు, ధాబాలు, రెస్టారెంట్లు, కేఫ్‌లలో ఆహార పరిరక్షణ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎన్. శివశంకర్ రెడ్డి తనిఖీలు చేపట్టారు.చిట్యాల పట్టణంలోని బ్లూ ఫాక్స్ మినర్వా కేఫ్‌లో పలు నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. గడువు ముగిసిన, నాణ్యత లేని ఆహార పదార్థాలు, గ్రేవీలు, మాంసం, మంచూరియా తదితర 55 కిలోల ఆహారాన్ని ధ్వంసం చేశారు. సంస్థకు మెరుగుదల నోటీసు జారీ చేసి, 6 ఆహార నమూనాలను విశ్లేషణకు సేకరించారు.ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి హెచ్చరించారు.

## వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి




**నల్లగొండ బ్యూరో, శుభోదయ డైనమిక్** రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, శాంతి సంఘాలు, గణేష్ ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి కోరారు.ఉత్సవ కమిటీలు గణేష్ మండపాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఊరేగింపుల్లో మద్యం సేవించి పాల్గొనడం, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడటం నిషేధమన్నారు.సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు, అభ్యంతరకర కంటెంట్‌ను ప్రచారం చేయవద్దని హెచ్చరించారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, పార్కింగ్ ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల విషయంలో నిబంధనలు పాటిస్తూ, ఇతరుల మనోభావాలను గౌరవించాలని కోరారు.సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఆర్‌డీఓ అశోక్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, శాంతి సంఘ సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

రౌడీ షీటర్లకు నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి హెచ్చరిక



**నల్గొండ బ్యూరో,శుభోదయ డైనమిక్** వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి రౌడీ షీటర్లను హెచ్చరించారు. సబ్‌డివిజన్ పరిధిలోని 150 మంది రౌడీ షీటర్లకు బుధవారం పోలీస్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని విడిచిపెట్టి ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఉత్సవాల్లో గొడవలు, అల్లర్లు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్‌తో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇప్పటికే 125 మంది రౌడీ షీటర్లపై బైండ్‌ఓవర్ చర్యలు చేపట్టి, రూ.2 లక్షల బైండ్‌ఓవర్‌తో ఆరు నెలల కాలపరిమితి విధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్ రెడ్డి, ఆదిరెడ్డి, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుల సెల్ జిల్లా కన్వీనర్‌గా శంకర్‌రెడ్డి



**నేరేడుచర్ల,“శుభోదయ డైనమిక్** బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి జిల్లాలో వివిధ మోర్చాలు, సెల్‌లకు నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా నేరేడుచర్ల బీజేపీ పట్టణ నాయకులు ఏమిరెడ్డి శంకర్‌రెడ్డిని దివ్యాంగుల సెల్ జిల్లా కన్వీనర్‌గా నియమించారు.ఏబీవీపీ విద్యార్థి సంఘం నుంచి పార్టీకి సేవలందిస్తూ, దివ్యాంగుల హక్కుల కోసం చేసిన పోరాటాలను గుర్తించి శంకర్‌రెడ్డికి ఈ బాధ్యత అప్పగించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డికి, జిల్లా కమిటీకి, నేరేడుచర్ల పట్టణ అధ్యక్షులు కొణతం నాగిరెడ్డికి, వివిధ మండలాల అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లో పార్టీ ఆదేశాల మేరకు దివ్యాంగుల హక్కులతో పాటు సామాజిక పింఛన్‌దారుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని చెప్పారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరిగేలా కృషి చేస్తామని శంకర్‌రెడ్డి పేర్కొన్నారు.

## మత్తు పదార్థాల నివారణకు సమన్వయ చర్యలు




**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** జాతీయ నషా ముక్త్ భారత్ అభియాన్ 6వ వార్షికోత్సవ సన్నాహాలపై బుధవారం జిల్లా అధికారులు వర్చువల్ సమావేశంలో సమీక్ష నిర్వహించారు. యువత, విద్యార్థుల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలని నిర్ణయించారు. సూర్యాపేటను మద్యం, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ చేపట్టనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీఈఓ అశోక్, డీఐఈఓ సులోచనరాణి, డీపీఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## కాళోజి జయంతి ఘనంగా నిర్వహణ




**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా హరిసింగ్ మాట్లాడుతూ తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజల జీవన విధానాన్ని కాళోజి తన రచనల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారని అన్నారు. అన్యాయాలు, అసమానతలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కాళోజి కీలక పాత్ర పోషించారని తెలిపారు.తెలంగాణ భాష, యాస మన అస్తిత్వానికి ప్రతీకలని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువత కాళోజి సాహిత్యాన్ని చదివి ఆయన ఆలోచనా విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో డీఆర్‌ఓ ప్రేమ్ రాజ్, బీసీ సంక్షేమ అధికారి విశాల్ ధారా, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీటీఓ రవికుమార్, డీఎస్‌ఓ మోహన్ బాబు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాళోజీకి పోలీసుల ఘన నివాళులు




**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచిన కాళోజీ తన సాహిత్యం, రచనలతో ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకొచ్చారని కొనియాడారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరసింహ చారి, సీఐ రాజశేఖర్, ఆర్ఐ ప్రవీణ్ కుమార్, ఆర్‌ఎస్‌ఐలు సాయిరాం, అఖిల్, పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, సెక్రెటరీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం




**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ సూచించారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్వీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హెల్త్‌ఫై హాస్పిటల్, సూర్యాపేట కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు గుండె తదితర ఆరోగ్య సమస్యలపై ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.శిబిరాన్ని ఎస్పీ నరసింహ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి సమర్థవంతమైన రక్షణ సేవలు అందించగలరు. పోలీస్ శాఖలోని ప్రతి ఒక్కరూ ఒక కుటుంబం లాంటివారు. సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యంపై శాఖ నిరంతరం శ్రద్ధ వహిస్తుంది” అన్నారు.వైద్య శిబిరంలో సుమారు 580 మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరసింహచారి, వైద్యులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో పరిశుభ్రత పాటించని. హోటళ్లు,

## పీజీ హాస్టళ్లపై టి జీ సేఫ్ కొరడా, తనిఖీలు

**మేడ్చల్--మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 09 శుభోదయ డైనమిక్:** కూకట్‌పల్లి పరిధిలోని రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, మెస్ సెంటర్లు, విద్యార్థుల పీజీ హాస్టళ్లలో తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (౦+ జాూఖీజు) ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది.
ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 10 సంయుక్త బృందాలు 20 సంస్థలను తనిఖీ చేయగా, తీవ్ర ఆహార భద్రత, పరిశుభ్రత లోపాలు వెలుగుచూశాయి. పలు చోట్ల బొద్దింకలు, ఈగలు, ఎలుకల బెడద, పాడైపోయిన ఆహార పదార్థాలు, గడువు ముగిసిన ఉత్పత్తులు, ఫంగస్ పట్టిన పదార్థాలు, సరైన నిల్వ విధానాలు పాటించకపోవడం వంటి ఉల్లంఘనలు గుర్తించారు. తనిఖీల్లో కుళ్లిన మాంసం, కూరగాయలు, పురుగులు పట్టిన పిండి, మసాలా దినుసులు, ఫంగస్ పట్టిన వేరుశెనగలు, అపరిశుభ్రమైన కోల్డ్ స్టోరేజీ సదుపాయాలు గుర్తించారు. కొన్ని సంస్థల్లో ముడి, వండిన ఆహారాన్ని వేర్వేరుగా నిల్వ చేయకపోవడంతో పాటు తప్పనిసరి రికార్డులు నిర్వహించకపోవడం, ఆహారాన్ని తయారు చేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం కూడా బయటపడింది. కలుషిత, పాడైపోయిన ఆహార పదార్థాలను అధికారులు అక్కడికక్కడే ధ్వంసం చేయించారు. జీవీకే న్యూ లగ్జరీ పీజీ మెన్స్ హాస్టల్ చెల్లుబాటు అయ్యే లైసెన్స్/రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహించడంతో పాటు తీవ్ర ఆహార భద్రతా నిబంధనల



ఉల్లంఘనలు గుర్తించడంతో వెంటనే మూసివేశారు. అలాగే మణికంఠ లైవ్ స్పేస్ లగ్జరీ ఉమెన్స్ హాస్టల్, శ్రీ బాలాజీ లగ్జరీ మెన్స్ పీజీ హాస్టల్ లైసెన్సులను తీవ్ర ఉల్లంఘనల కారణంగా సస్పెండ్ చేశారు. ఈ హాస్టళ్లలో భారీగా బొద్దింకల బెడద, ఫంగస్ పట్టిన ముడి పదార్థాలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు గుర్తించారు. హోటల్ సితార గ్రాండ్ లో ఎలుకల బెడద, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, అపరిశుభ్రమైన కోల్డ్ స్టోరేజీ గుర్తించి కేసు నమోదు చేశారు. మాక్స్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్, మండి కింగ్ అరేబియన్ పై తీవ్ర పరిశుభ్రత, నిల్వ నిబంధనల ఉల్లంఘనలకు జరిమానాలు విధించారు.



ప్యారడైజ్ ఫుడ్ కోర్ట్, చైతన్య ఫుడ్ కోర్ట్, భూలక్ష్మి మెస్, గోదావరి మిఠాయి లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరికొన్ని సంస్థలకు మెరుగుదల నోటీసులు ఇచ్చి, నిబంధనల అమలును పరిశీలించేందుకు తప్పనిసరి ఫాలోఅప్ తనిఖీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీ చేసిన సంస్థల నుంచి 20 ఆహార నమూనాలను అధికారులు సేకరించి, కల్తీతో పాటు ఇతర ఆహార భద్రతా ఉల్లంఘనలు ఉన్నాయా అనే విషయాన్ని నిర్ధారించేందుకు చట్టబద్ధమైన ప్రయోగశాల పరీక్షలకు పంపించారు.

# ప్రజాకవి కాళోజీ జయంతి ఘనంగా నిర్వహణ

**నర్సింహాపురం, శుభోదయ డైనమిక్** మునగాల మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ మాట్లాడుతూ.. సామాన్యుల భాషకు, తెలంగాణ యాసకు కాళోజీ నారాయణరావు విశిష్ట గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. తెలంగాణ ప్రజల ప్రతి ఉద్యమానికి కాళోజీ ప్రతిధ్వనిగా నిలిచారని పేర్కొన్నారు. రాజకీయ, సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించేలా ఆయన కవిత్వం సాగిందన్నారు. ప్రజల హక్కుల కోసం గళమెత్తిన కాళోజీ.. నిరంకుశత్వం, దమననీతికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా తన కలాన్ని అక్షర ఆయుధంగా మలిచారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా ప్రజల కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు. తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ, మరాఠీ, ఇంగ్లిష్ భాషల్లో రచనలు చేసిన కాళోజీ.. రాజకీయ వ్యంగ్య కవిత్వంలో ప్రత్యేక ముద్ర వేశారని



అన్నారు. 'నా గొడవ' వంటి రచనల ద్వారా సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా స్పందిస్తూ పాలకులను ప్రశ్నించారని పేర్కొన్నారు. కాళోజీ తన జీవితాన్ని తెలంగాణ ప్రజల కోసం అంకితం చేసిన మహనీయుడని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుపాముల పశువైద్యాధికారి డాక్టర్ హరిత, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ శ్రీధర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ముత్తయ్య, అంగన్‌వాడీ టీచర్ ఉమ, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో పోషణ్ మాసం అవగాహన కార్యక్రమాలు ప్రారంభం

**మేడ్చల్--మల్కాజిగిరి, సెప్టెంబర్ 09 శుభోదయ డైనమిక్ :** జిల్లాలో 9వ పోషణ్ మాసం కార్యక్రమాలు బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల ద్వారా ప్రతి కుటుంబంలో పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిపై విస్తృత అవగాహన కల్పించనున్నారు. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్ (×ఙూజ)లో జిల్లా కలెక్టర్ మను చౌదరి 9వ పోషణ్ మాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
జిల్లాలోని 793 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, శిశువులు, చిన్నారులు, కౌమార బాలికలు, మహిళల ఆరోగ్యం మరియు పోషకాహార స్థితి మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు, బరువు ప్రమాణాలను క్రమం తప్పకుండా నమోదు చేయడంతో పాటు ప్రత్యక్ష పోషకాహార ప్రదర్శనలు నిర్వహించనున్నారు. శిశువులకు అనుబంధ ఆహారం



అందించే విధానం, స్థానికంగా లభించే సమతుల్య ఆహార పదార్థాల ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించనున్నారు. అలాగే పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, పోషకాహార లోపం నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, అవగాహన సదస్సులు, తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశాలు, సామాజిక చర్చా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. "పోషకాహారం -- ఆరోగ్యం -- ఆరోగ్యకరమైన భవిష్యత్తు" అనే ప్రధాన సందేశంతో కార్యక్రమాలను వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. జిల్లా ప్రజలు, తల్లిదండ్రులు, మహిళలు, యువత పెద్దఎత్తున పాల్గొని పోషణ్ మాసం కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## 25వ వార్డులో రూ.5 లక్షలతో విద్యుత్ పనులకు శ్రీకారం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు

### మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్

**శుభోదయ డైనమిక్ -- హుజూర్‌నగర్** హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు వేగం పెరిగింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారం, ఆశీస్సులతో పట్టణంలోని 25వ వార్డులో రూ. 5 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధి దీపాల పనులకు మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా 25వ వార్డులో విద్యుత్ అభివృద్ధి పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ పనిచేస్తోందన్నారు. నూతన విద్యుత్ లైన్లు, స్తంభాలతో పాటు వార్డులో మిడిల్ పోల్స్ ఏర్పాటు చేసి వీధి దీపాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. దీంతో రాత్రి వేళల్లో చీకటి సమస్య తొలగిపోవడంతో పాటు ప్రజల రాకపోకలకు భద్రత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ పనులు ప్రారంభించడంపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రామ్ ప్రసాద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 25వ వార్డు కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి, 3వ వార్డు కౌన్సిలర్ సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్, కౌన్సిలర్లు చెనగాని సైదులు, జక్కుల మల్లయ్య, వల్లపుదాసు కృష్ణ, నందిగామ సైదులు, దగ్గుబాటి కవిత బాబురావు, కోలా ఉదయభాను, సావిత్రి ప్రవీణ్, బద్రమ్మ రమేష్, సుజాత చంటి, స్థానిక నాయకులు ఓర్సు వెంకన్న, తోట ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎం ఈ ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా వల్లపట్ల కృష్ణ నియామకం

### విధేయతకే పట్టం కట్టిన జాతీయ నాయకత్వం



**శుభోదయ డైనమిక్ న్యూస్, సెప్టెంబర్ 09, సూర్యాపేట :** తెలంగాణ మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎం.ఈ.ఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన వల్లపట్ల కృష్ణ నియమితులైనారు. ఈ మేరకు ఆదివారం తేది: 06.09.2026 నాడు ప్రకటన విడుదల చేసినారు. వీరు 1997 సం××లో ఎం.ఆర్.పి.ఎస్ గ్రామ శాఖ అధ్యక్షునిగా ప్రస్థానం మొదలుకొని, 2016 సం××లో ఎం.ఈ.ఎఫ్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శిగా, 2017 సం××లో ఎం.ఈ.ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యునిగా, 2020 – 2024 వరకు సం××లో ఎం.ఈ.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మరియు 2024 నుండి జిల్లా అధ్యక్షులుగా ఇప్పటివరకు కొనసాగుతూ ఉన్నారు. వీరు ఎం.ఈ.ఎఫ్ ఫెడరేషన్ లో చేసిన సేవలు గుర్తించి ఎం.ఆర్.పి.ఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ గౌరవ మంద కృష్ణ మాదిగ, ఎం.ఈ.ఎఫ్ జాతీయ నాయకత్వం మరియు ఎం.ఈ.ఎఫ్ రాష్ట్ర నాయకత్వం వీరిని ఎం.ఈ.ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమిస్తూ బాధ్యతలు అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా వల్లపట్ల కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తన నియమకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసినారు.

## కుత్బుల్లాపూర్‌లో 1.2 కిలోల గంజాయి స్వాధీనం ఇద్దరు అరెస్ట్



**మేడ్చల్-మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 9 శుభోదయ డైనమిక్:** కుత్బుల్లాపూర్‌లో బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక దాడిలో 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ గంజాయి వ్యాపారానికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ప్రాంతంలో అక్రమంగా మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో డీటీఎఫ్ బృందం దాడి నిర్వహించింది. ఈ సందర్భంగా అనుమానితులను అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు.
ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం, అరెస్టయిన వారిని షేక్ అబ్దుల్లా, ఎండీ జహీర్గా గుర్తించారు. దాడి అనంతరం అరెస్టయిన ఇద్దరినీ, స్వాధీనం చేసుకున్న గంజాయిని తదుపరి చట్టపరమైన చర్యలు మరియు దర్యాప్తు నిమిత్తం కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

## రేవంత్ రెడ్డిది నియంతృత్వ పాలన

### ముఖ్యమంత్రిని తక్షణమే భర్తరఫ్ చేయాలి: మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



**కోదాడ, శుభోదయ డైనమిక్** ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. కోదాడ పట్టణంలోని తన నివాసంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు రైతులు, విద్యార్థులు, పారిశుద్ధ్యం తదితర ప్రజా సమస్యలపై నిర్వహించిన నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసిన కోదాడ నియోజకవర్గ ప్రజలకు, బీఆర్ఎస్ శ్రేణులకు, మీడియా ప్రతినిధులకు మల్లయ్య యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే సమాధానం చెప్పలేక వారిపై చర్యలు తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. సీనియర్ మహిళా ఎమ్మెల్యేల పట్ల అసెంబ్లీలో అనుచితంగా వ్యవహరించిన ఘటనలపై ముఖ్యమంత్రి కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మూకుమ్మడిగా సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. సభకు హాజరుకాని నేతలను సైతం సస్పెండ్ చేయడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 'హిట్లర్ తరహా నియంతృత్వ పాలన' కొనసాగుతోందని మల్లయ్య యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారి గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగులకు జీతాల సమస్యలు ఉన్నాయని, వ్యవసాయ, నిర్మాణ రంగాలు ఇబ్బందుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. రైతులపై భారం మోపేలా ఉన్న 22ఏ జీవో, విద్యుత్, సాగునీటి సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరగకుండా ఉండేందుకే బీఆర్ఎస్ సభ్యులను సభ నుంచి బయటకు పంపించారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో ముఖ్యమంత్రి, హోంమంత్రిగా రేవంత్ రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై బీఆర్ఎస్ ప్రతినిధులు ఇప్పటికే గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థలను కాపాడేందుకు గవర్నర్ జోక్యం చేసుకోవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తక్షణమే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని మల్లయ్య యాదవ్ స్పష్టం చేశారు.

## సంవత్సరికం కార్యక్రమంలో పాల్గొని నివాళు లర్పించిన సర్పంచ్ కోల లింగయ్య గౌడ్



**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతే** సెప్టెంబర్ 9 మోతే మండలం రాఘవపురం ఎక్స్ రోడ్డు నిమ్మల నర్సిరెడ్డి తల్లి సంవత్సరికం లో పాల్గొని నివాళులర్పించిన రాఘవపురం ఎక్స్ రోడ్ సర్పంచ్ కోల లింగయ్య గౌడ్. మండల ప్రధాన కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్. గ్రామ శాఖ అధ్యక్షులు కారింగుల లింగమూర్తి గౌడ్. తాటికొండ సోమిరెడ్డి. కోల రవి. బొడ్డు వెంకట్. మర్రు సతీష్ కుమార్. బత్తిని జానయ్య గౌడ్. కోల రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ యాస, భాషను కాపాడిన మహనీయుడు కాళోజి

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి. నీరజ



**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టేలా తన కలం ద్వారా ఎన్నో రచనలు చేసి తెలంగాణ భాష, యాసను కాపాడిన మహనీయుడు కాళోజీ నారాయణరావు అని నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి. నీరజ కొనియాడారు.కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని బుధవారం కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నీరజ మాట్లాడుతూ.. కాళోజీ ఆంధ్ర మహాసభ, గ్రంథాలయ ఉద్యమం, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌తో పాటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాళోజీని అణగదొక్కే ప్రయత్నాలు జరిగాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు.సీనియర్ అధ్యాపకులు పి. వెంకటరమణ, డాక్టర్ మద్దిమడుగు సైదులు మాట్లాడుతూ.. కర్ణాటకలో జన్మించిన కాళోజీ రెండేళ్ల వయసులోనే కుటుంబంతో తెలంగాణకు వచ్చి వరంగల్‌లో స్థిరపడ్డారని తెలిపారు. ఆయన శాసనమండలి సభ్యునిగా సేవలందించడంతో పాటు పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఎల్లప్పుడూ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోతారని అన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రణతి, కే.ఎల్.ఎన్. రావు, వెంకన్న, శ్రీనివాసులు, సునీత, ప్రసాద్, అంజయ్య, నరసింహాచారి, గణేష్, వీరు, వెన్నెల, అపర్ణ, వీరేష్‌తో పాటు సిబ్బంది అన్వేష్, వెంకన్న, దుర్గయ్య, ఖాన్, బేగం తదితరులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాలు, పోషకాహారంతో ఆరోగ్యం -- అవగాహన కార్యక్రమం



**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** పోషణ మాసోత్సవాల్లో భాగంగా నేరేడుచర్ల గ్రామపంచాయతీ పరిధిలో మహిళా సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం తల్లులకు చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ ఎన్. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలను భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు.కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ బుర్రి శ్రీను మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు.సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషణ మాసోత్సవాల సందర్భంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఎన్. జానమ్మ, అంగన్‌వాడీ టీచర్ ఎన్. ఆమని, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఆర్అండ్ఆర్ (పునరావాసం, పునరుద్ధరణ) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో జిల్లాలోని భూసేకరణ పనులపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎండోమెంట్, పంచాయతీరాజ్ తదితర శాఖల పరిధిలో కొనసాగుతున్న భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు.ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనల ప్రకారం పెండింగ్‌లో ఉన్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, ఆర్అండ్‌బీ ఈఈ సీతారామయ్య, ఎండోమెంట్ ఏడీ (నల్గొండ), పంచాయతీరాజ్ ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, సంబంధిత తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ డాక్టర్ ధనవత్ నగేష్ మృతి దేహానికిపూలమాలు వేసిన బొల్లం మల్లయ్య యాదవ్



**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతే సెప్టెంబర్ 9** మోతే మండలం లాల్ తాండ గ్రామానికి చెందిన ధారావత్ నగేష్ అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలుసుకున్న కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ లాల్ తండాలోని నగేష్ నివాసానికి వెళ్లి భౌతికయానికి పూలమాలవేసి నివాళులర్పించాడు అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరమర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు నగేష్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తంచేశారు ఈ యొక్క కార్యక్రమంలో మోతె మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శీలం సైదులు యాదవ్. మండల ప్రధాన కార్యదర్శి మద్ది మధుసూదన్ రెడ్డి. మాజీ సర్పంచులు బానోతు వెంకన్న. గాంధీ. దేవుల. బా ఓ సింగ్. రామకోటి తదితరులు పాల్గొని ధారవత నగేష్ కు నివాళులర్పించారు

# జర్నలిస్టు షేక్ సైదాను పరామర్శించిన కౌన్సిలర్ కృష్ణ, ముజావర్ సైదా, మీరా



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్‌నగర్,** సెప్టెంబర్ 10: తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, సూర్యాపేట జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు లిషేక్ సైదాలి అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న 19వ వార్డు కౌన్సిలర్ లివల్లపుదాసు కృష్ణలి బుధవారం ఆయనను పరామర్శించారు. హుజూర్‌నగర్ పట్టణంలోని రామస్వామి గట్టు వద్ద ఉన్న షేక్ సైదా స్వగృహానికి వెళ్లిన కౌన్సిలర్ కృష్ణ ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని, వైద్యుల సూచనలు, చికిత్స వివరాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజా సేవా, పాత్రికేయ రంగాల్లో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ మాట్లాడుతూ, లిషేక్ సైదా ఎన్నో సంవత్సరాలుగా పాత్రికేయ రంగంలో పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారనిలి అన్నారు. సమాజంలోని ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమని, సైదా త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్య సమయంలో సైదాను పరామర్శించి ధైర్యం చెప్పడం పట్ల కుటుంబ సభ్యులు కౌన్సిలర్ కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ సైదాలి, మీరాలి తదితరులు పాల్గొని షేక్ సైదా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు

# రోజు రోజుకు పెరుగుతున్న కరెంట్ కష్టాలు

అయోమయంలో రైతన్నలు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వల్ల ఎండుతున్న పొలాలు

ఆలింగపురం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన



**శుభోదయ డైనమిక్ పాలకీడు** మండల పరిధిలోని గుండెబోయినగూడెం , గుండ్లపహాడ్, నార్లెంగళ గూడెం గ్రామాల రైతులు ఆలింగపురం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ .రెండు గంటలు అకారణంగా విద్యుత్ కోత విధిస్తున్నారని వాపోయారు . ఇచ్చే అరకొర సమయంలో కూడా లో ఓల్టేజ్ కరెంట్ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 12 గంటలు ఇవ్వాల్సిన కరెంటు కనీసం 10 గంటలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీరు ఉండికూడా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంట పొలాలు ఎండిపోతున్నాయని తమ గోడును వెల్లబోసారు. ఇకనైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన కరెంటు, ఇవ్వాల్సిన సమయాల్లో, కోత లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఇకపై ప్రతిరోజూ ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

**లైన్ మ్యాన్ వెంకన్న మాకొద్దంటూ డి ఈ కి లేఖ**

లైన్ మ్యాన్ వెంకన్న రైతులకు ఏ మాత్రం స్పందించడం లేదని, తనను వెంటనే బదిలీ చేసి వేరే వారిని నియమించాలని డిఈ కి లేక రాశారు. కరెంట్ సమస్య గురించి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లైన్ మ్యాన్ వెంకన్న దురుసుగా ప్రవర్తిస్తున్నాడని పేర్కొన్నారు.కార్యక్రమంలో గుండెబోయిన గూడెం గ్రామ సర్పంచ్ యాతం శ్రీనివాస్, రైతులు శోభన్ బాబు, పుట్ల నాగేశ్వరరావు, వెంకట్ నాయుడు, అంజయ్య, దాసు,శ్రీనివాస్ రెడ్డి, మధు ,బాబు , ఎడ్ల శ్రీను, గోనె శ్రీను తదితర రైతులు పాల్గొన్నారు

# కాళోజి జయంతి వేడుకలు ఘనంగా




**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజి నారాయణరావు 112వ జయంతి వేడుకలను పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్లలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం బట్టు మధు మాట్లాడుతూ.. "పుట్టుక నీది.. చావు నీది.. బ్రతుకంతా దేశానిది" అనే కాళోజి సందేశం ఆయన జీవితానికి అద్దం పడుతుందని అన్నారు. తెలంగాణ యాస, భాషకు సాహిత్య రంగంలో విశిష్ట గుర్తింపు తీసుకువచ్చిన కాళోజి సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన రచనల సంకలనం 'నా గొడవ' అణగారిన, నిస్సహాయుల గొంతుకగా నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కాళోజికి జోహార్లు అర్పించారు.

# 10 దొంగతనం కేసులు ఛేదించిన సీసీఎస్ పోలీసులు

కోదాడలో వరుస ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

రూ.60 లక్షల విలువైన 37.2 తులాల బంగారం, 470 గ్రాముల వెండి, రూ.3.60 లక్షల నగదు, కారు స్వాధీనం



**కోదాడ, శుభోదయ డైనమిక్** కోదాడ పట్టణంలో రాత్రివేళ తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కోదాడ పట్టణ పోలీసులు, జిల్లా సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. మొత్తం 10 దొంగతనం కేసులను ఛేదించినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు.అరెస్టైన నిందితుడు జగద్గిరిగుట్టలోని పాపిరెడ్డినగర్ కాలనీకి చెందిన పట్నం శెట్టి రాజు ఏ రాజీ రెడ్డి (41). వృత్తిరీత్యా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.నిందితుడి నుంచి 37.2 తులాల బంగారం, 470 గ్రాముల వెండి, రూ.3.60 లక్షల నగదు, కారు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తి విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందని వెల్లడించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ నరసింహ కేసుల దర్యాప్తు, నిందితుడి అరెస్ట్, స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలను వెల్లడించారు.

# ప్రజా సమస్యలను గాలికి వదిలి బూతులతో కాలయాపన సిగ్గుచేటు....

సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపెల్లి సైదులు



**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతే సెప్టెంబర్ 9 మోతే:**ప్రజా సమస్యలపై చర్చించాల్సిన శాసనసభలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు బూతులతో దూషించుకుంటూ విలువైన సభా సమయాన్ని వృథా చేయడం సిగ్గుచేటని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టి పెల్లి సైదులు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అసెంబ్లీ గేటు వద్ద నిరసన తెలిపిన బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత హేయమని, అదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన సంస్కారహీన వ్యాఖ్యలు కూడా ఖండనీయమని అన్నారు. ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో విద్య, వైద్యం వ్యాపారంగా మారడం, ఉద్యోగాల భర్తీ నామమాత్రంగా ఉండటం, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, కూలీలకు పని, కార్మికులకు కనీస వేతనాలు వంటి ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోవడం పట్ల ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళల సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలని అన్నారు. ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరిపి పరిష్కారానికి కృషి చేయాలని, లేనిపక్షంలో ప్రజలు అధికార, ప్రతిపక్ష పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారని మట్టి పెల్లి సైదులు హెచ్చరించారు.

# అనారోగ్యంతో గ్రామీణ వైద్యుడు మృతి

కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్న ఆర్ఎంపీలు.



**శుభోదయ డైనమిక్ న్యూస్ సెప్టెంబర్ 9 మోతే:** మండలంలోని లాలాతండా గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు ధారావత్ నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న మండలంలోని పలువురు ఆర్ఎంపీలు లాలాతండా గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. నాగేశ్వరరావుతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న వారు, ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు పరిచయస్తులకు తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబానికి అవసరమైన సమయంలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.అనంతరం నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గురిజాల మైసయ్య, వెంకటేశ్వర్లు, అనంతుల రవి, ఉపేంద్రాచారి, శ్రీశైలం, రమేష్. చాంద్ పాషా.తదితర ఆర్ఎంపీలు పాల్గొన్నారు.


# అనారోగ్యంతో గ్రామీణ వైద్యుడు మృతి

కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్న ఆర్ఎంపీలు.




**శుభోదయ డైనమిక్ న్యూస్ సెప్టెంబర్ 9 మోతే:** మండలంలోని లాలాతండా గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు ధారావత్ నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న మండలంలోని పలువురు ఆర్ఎంపీలు లాలాతండా గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. నాగేశ్వరరావుతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న వారు, ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు పరిచయస్తులకు తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబానికి అవసరమైన సమయంలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గురిజాల మైసయ్య, వెంకటేశ్వర్లు, అనంతుల రవి, ఉపేంద్రాచారి, శ్రీశైలం, రమేష్. చాంద్ పాషా.తదితర ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA